# నాలోనివాడు

ఆ రోజు నాకేమీ బాగాలేదు. ఆ రోజే కాదు. బి.ఎ. ప్యాసయి నప్పటినుంచీ ఇట్లాగే వుంది. పట్టా తీసుకునే రోజులు దగ్గరకు వస్తున్న కొద్దీ ఈ బాగా లేకపోవటం మరీ ఎక్కువైంది. ఇక ఎల్లుండే ఎన్‌రోల్ అవాల్సిన రోజు.

ఆందోళనతో మనస్సు చీకాకు చీకాగ్గా వుంది. ఆలోచనలమీద ఆలోచనలు....

“ఇదేం ప్రపంచం? కొందరు కేరింతలతో ప్రవేశిస్తున్నారు. కొందరు రోదన ధ్వనులతో నిష్క్రమిస్తున్నారు. కొందరు దేవతలకుమల్లే ప్రేమలో మునిగి తేలుతున్నారు. కొందరు రాక్షసులకుమల్లే రక్తంలో ఈదులాడు తున్నారు. ధనాంధుల కలకలం. దరిద్రనారాయణుల కాకిగోల, గుసగుసలు, గిజగిజలు.

ఏమిటి ప్రపంచం? దీన్ని ఎవ్వరు సృష్టించారు? ఎందుకు? ఎవరి కోసం? ఆలోచించాను....ఆలోచించాను....ఆలోచించాను....ఆలోచించిన కొద్దీ ఎవరో—సాయిబా—నా హృదయాన్ని దూదిఏకినట్టు ఏకుతున్నాడు. ఆలోచించటం వానికి ఇష్టంలేదని మానివేశాను. నా హృదయం, అంధ కారంలోనుంచి వెలుగులోకి వచ్చినప్పుడు కళ్ళు రెపరెపలాడినట్లు, రెపరెప లాడింది. మరుక్షణం కోత....

సంఘంలో అనేకమందికంటే నేను అదృష్టవంతుణ్ణి. నన్ను వాత్సల్యంతో ఆదరించి నా తప్పులను మురుసుకునే నాన్నగారు వున్నారు.

నన్ను హృదయపూర్వకంగా ప్రేమించి నా శ్రేయస్సునికాంక్షించే స్నేహితులున్నారు. నన్ను అర్థం చేసుకొని, నా బాధలను—నా సుఖాలను నాకే వొదిలి—తనవిగా భావించుకునే హృదయేశ్వరి వుంది. నాకు మెదడు వుంది. కమ్మని హృదయం వుంది. కావలసినంత ఆరోగ్యముంది. "నా కెందుకీ అవస్థ?" అని ప్రశ్నించుకున్నాను.

జవాబు లేదు.

నాలోనివాడు, 'ఈ ప్రపంచం ఒకబందిఖానా. ఆ బందిఖానాలో ఈ శరీరం ఒక చిన్న బందిఖానా. అందులో నీవు బిక్కమొహంలో, గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నావు, అన్నాడు.

నాకు భయంవేసింది ఎప్పుడో నా జీవితం—నాకు తెలియకుండానే—కుళ్ళిపోయిన బంగినపల్లి మామిడిపండులాగు, ఎలక్షన్ వ్యామోహంలో మురిగిన మానవుని హృదయంలాగు అయిపోతుందేమో అని తారెత్తింది.

సిగరెట్ ముట్టించాను. లాభంలేదు. పుస్తకం తీశాను విక్టర్ హ్యూగో వ్రాసిన 'The Last Days of a Condemned Man' కంపరం పుట్టించి. జుట్టు పీక్కోబుద్ధి అయింది.

సినిమాకి వెళ్ళాను-ఫిలిం బాగుంది-డైరక్షన్ అద్భుతంగా వుంది. కాని నా మనసు శాంతించలేదు. ప్రేమించుకోవటం, పైత్యంచుకోవటం—ఇవేనా ఇప్పుడు మన దేశానికి కావలసింది? ఈ దౌర్భాగ్య దేశంలోని వర్గ కలహాన్ని ఈ సినిమాలూ, పుస్తకాలూ ఎంతవరకు ప్రతిబింబిస్తున్నయ్? మళ్ళీ ఆలోచనలు—ఈసారి బాల్‌జాక్, టాల్‌స్టాయ్, బెర్నార్డు షా, గోర్కీ....

ఇక అక్కడ ఒక్క క్షణం కూర్చోలేకపోయాను. బరువు హృదయంతో బయటకు వచ్చాను. ఒక పిల్లవాడు పొట్ట కొట్టుకుంటూ, "బాబా, ఆకలి! బాబా, ఆకలి!" అన్నాడు.

నేను వాణ్ణి తేరిపార చూశాను. వాడు పద్యం మొదలు పెట్టాడు. దాని తాత్పర్యం చెపుతాను—

"మీరు చదువువంకతో పట్నాలు వొచ్చి వేలకు వేలు తగలేస్తున్నారు సిగరెట్లువూదిపారేస్తున్నారు, కాఫీ తాగుతారు. సినిమాలకు వెళ్తారు. బోగం కొంపల్లో జలసా చేస్తారు, కాని నా సంగతి ఆలోచించరు....ఆలోచించరు....ఆలోచించరు...."

నాకు వికారం కలిగింది. నాలోనివాడు ప్రశ్నించాడు-"నీ కింత ధనమిచ్చి, వాడికి దమ్మిడీ లేకుండా చేసింది ఎవరు?"

"సంఘం" అన్నాను.

"ఎవరు సృష్టించారీ సంఘాన్ని?"

"మానవుడు."

"ఎందుకు? ఎవరి కోసం?"

"మానవుల కోసం,"

"మరి ఇదేమిటి?"

నేను జవాబు చెప్పలేకపోయాను. ఏదో ఘోరపాపం-హత్యలే—చేస్తున్నట్లు బాధపడ్డాను.

ఆ కుర్రవాడు 'బాబా!' అని నా పాదాలు తాకాడు. ఆ స్పర్శకు నా శరీరం మంచుకి వొణికినట్లు వొణికిపోయింది. అక్కడ వుండలేక గదికి గబగబా బయల్దేరాను. నన్ను చూచి రిక్షావాలాలు "రిక్షాసామి, రిక్షాసామి" అని పిలిచారు. వారికి నా మొహం-ఏ మొహంపెట్టుకొని చూపించను?- చూపించలేకపోయాను. శరీరమంతా గొంగళి పురుగులు పాకినట్లయింది. పరిగెత్తాను. ఒకటే పరుగు!

ఆ రాత్రి పన్నెండు గంటలకు కన్ను మూశాను. నేనూ ఆ పిల్లవాడూ దేవుని దగ్గరకు వెళ్ళా -"దేవా! నే నీ ప్రపంచంలో బ్రతకలేను! ఇంకొక ప్రపంచంలోనికి తీసుకొనిపో" అని ప్రార్థించాను.

ఆ పిల్లవాడు, "ఆకలి....ఆకలి....బువ్వ పెట్టు!" అని గుని సాడు.

దేవుడు నవ్వాడు. మమ్మల్నిద్దర్నీ దగ్గరకు రమ్మని పిలిచాడు. నేను నడవలేకపోయాను. ఆ పిల్లవాడు అడుగులు వేస్తూ వుంటే, వాడి అంటు డొక్కలు, "మా పొత్తు గిట్టక మరో ప్రపంచం కావాలంటున్నావా?" అంటూ ఎగిరిపడ్డవి. నేను ఉలిక్కిపడి లేచాను. మరో ప్రపంచం కావాలన్నందుకు సిగ్గువేసింది. తల వొంచుకున్నాను.

## 2

తెల్లవారింది-దిగులుతో లేచాను. దిగులుతో కాలకృత్యాలు తీర్చుకున్నాను. ఇక్కడ నా కొక స్నేహితున్నాడు. అతడు అద్భుతమైన తెలివితేటలు గలవాడు. కాని అతని హృదయాన్ని సంఘం ముక్కలు ముక్కలు చేసింది. ఒక ముక్క సోషలిజం అంటుంది. ఒక ముక్క జస్టిస్‌పార్టీకి ఓటివ్వమంటుంది, ఒక ముక్క కళకు సంఘ శ్రేయస్సు ఆదర్శంగా వుండాలంటుంది. ఒక ముక్క కళ కళకోసమే అంటుంది. ఒక ముక్క దేవుడు అంటుంది. ఒక ముక్క శూన్యం అస్తి అంటుంది. యశోదమ్మకు శ్రీకృష్ణుని నోటిలో పధ్నాలుగు లోకాలు కనిపిస్తే, నా కితనిలో హిందూదేశం, హిందూదేశ నాగరికతా కనిపిస్తాయి.

అతని దగ్గరకు వెళ్ళాను. అతడు మరికొందరితో కలిసి చీట్లాడుతున్నాడు. నా కదో ప్రపంచంగా కనిపించింది. ఆ నల్లఆకాశం—ఆ చిల్లరడబ్బులు నక్షత్రాలు—నోట్ల కట్టలు మేఘాలు-వారు దిక్పాలకులు.

"కూర్చో, చెయ్యిస్తాం" అన్నారు.

"ఆడను" అన్నాను.

"అయితే యిలా కూర్చొని ఈ పజిల్ సాల్వు చెయ్యి" అన్నాడు మిత్రుడు.

"బైటికి పద" అన్నాడు నాలోనివాడు.

"కొంచెం పనుంది; ఇప్పుడే వస్తాను" అని చెప్పి బయలుదేరాను.

"ప్రపంచంలో వున్న పజిల్సు సాల్వుచేస్తే చాలు" అన్నాడు నాలోనివాడు.

"ప్రపంచంలోని పజిల్స్ సాల్వు కావు. షోపెనార్ ఏంచెప్పాడు? ప్రపంచంలోని సమస్యలు పరిష్కరింపబడవు. ఎందుకంటే సమస్యలు లేకపోతే ప్రపంచమే వుండదు గనక" అని నేను జవాబు చెప్పాను.

కాని నాలోనివాడు ఇంతటితో వూరుకోలేదు. ఏవేవో ప్రశ్నలు వేస్తూనే వున్నాడు. నేను నాకు చేతనయినట్టు జవాబులు చెప్పుకుంటూనే వున్నాను. తనువు మాత్రం కీ యిచ్చి వదలిన యంత్రంలాగు తనంత తానే ఎక్కడికో వెళ్తూవుంది.

తనువుకి ఒక బిచ్చగాడు అడ్డు తగిలాడు. "అయ్యా; సామీ" అన్నాడు. అతడు వృద్ధుడు. పైగా దారిద్ర్యంతో ప్రతి అవయవం కృశించి వుంది. వాడినుంచి తప్పించుకోటానికి వేగంగా నడిచాను. వాడు నా దౌర్బల్యం కనిపెట్టి, "అయ్యా, సామీ!" అంటూ వెంటపడ్డాడు. నేను పరిగెత్తాను.

దారిలో ఎంగిలి విస్తళ్ళు ఆప్యాయంగా నాకుతున్న మనుష్యులు–వాళ్ళల్లోను దేవుడున్నాడు!– కనిపించారు. పెడబొబ్బలు పెట్టి ఏడుస్తున్న కుంటివాళ్ళు, గ్రుడ్డివాళ్ళు, కుష్టు వాళ్ళు–వాళ్ళల్లోను దేవుడున్నాడు–కనిపించారు. కళ్ళుమూసుకొని ఉన్మత్తునివలె పరిగెత్తాను–ఎవ్వరో కిచ కిచ నవ్వారు. ఆంగ్లో–ఇండియన్ కన్యలై వుంటారు–గదిలోకి వచ్చి పడ్డాను.

ఆ రాత్రి మళ్ళీ దేవుడు కనిపించాడు.

"మరో ప్రపంచం కావాలా?" అని అడిగాడు.

"అక్కర్లేదు-స్వామీ, అక్కర్లేదు. తమరు కటాక్షించి తమరి దివ్యదర్శనం యిప్పించకుండా ఉంటే—అదే చాలు" అన్నాను.

"నీచుడా, ఛండాలుడా, నేను లేకపోతే నీ జన్మ వృధా—పో—పో" అని అరిచాడు దేవుడు.

నేను అదిరిపడి లేచాను భయంతో. "అమ్మా!" అని అరిచాను-చిన్నతనంలోనే అమ్మను పోగొట్టుకున్న అదృష్టహీనుణ్ని-"అమ్మా! అమ్మా! అమ్మా!" అంటూ ఆ రాత్రంతా ఏడ్చాను.

*  *  *  *  *

మళ్ళీ తెల్లవారింది—మళ్ళీ దిగులుతో లేచాను—మళ్ళీ దిగులుతో కాలకృత్యాలు తీర్చుకున్నాను. ఈ నాడే నేను హైకోర్టు అధికారులచేత "అడ్వొకేట్" ముద్ర వేయించుకునేది. అసలు హైకోర్టుకి వెళదామా, వొద్దా అని మధనపడ్డాను.

హృదయేశ్వరి కనిపించింది. ఆమె ఒకసారి అన్నది-"పిల్లలో."

నాన్నగారు కనిపించరు. ఆయన ఒకసారి అన్నాడు—"మా వాడు లేకపోతే నా జన్మ వృధా."

స్నేహితులు కనిపించారు. వారు అడిగేవారు-"ఎప్పుడు ప్రాక్టీసు పెడతారు?"

దృఢ సంకల్పంతో లేచి నల్లకోటు వేసుకున్నాను. పెట్టె తెరిచి వెయ్యిరూపాయలు జేబులో పెట్టుకున్నాను. నా గదిలోని నల్లపిల్లి భయం భయంగా నాచుట్టూ తిరిగి, జాలిగా చూచి, "మ్యాఁవ్, మ్యావ్" అన్నది.

"ఫో" అని విదిలించాను.

పాపం వెళ్ళిపోయింది.

నేను ముస్తాబై హైకోర్టుకి బయలుదేరాను. నాలోని వాడు మాట్లాడలేదు. జయించానని గర్వపడ్డాను. హైకోర్టు గేటులో ఠీవిగా అడుగు పెట్టాను.

"బాబూ! బాబూ!" ఎవ్వరో పిలిచారు.

దొంగలాగా బెదిరి, వెనుదిరిగి బిత్తర చూపులు చూశాను.

"బాబూ! బాలింతరాలిని. అయిదురోజులనుంచీ దారకం లేదు—చంటిది చచ్చిపోతావుంది—నావొళ్ళు అగ్గిలాగా మండిపోతావుంది" అని జ్వరం చూడమన్నట్లు మెడ చాచి చెంప అందించింది.

నేను ఆమెను చూడలేకపోయాను. ఆమె వంటిమీద ఎక్కడ గుడ్డ వుందో ఎక్కడలేదో చెప్పలేను. చేతిలోని కసిగందును చూశాను. శరీరం ముచ్చెమటలు పోసింది. బుద్ధునికి బోధిచెట్టుకిందా, మహాత్మునికి భోగం కొంపలో కలిగిన జ్ఞానం నాకీ బాలింతరాలిముందు కలుగుతుందేమో అని భయం వేసింది.

హైకోర్టువైపు మొహం తిప్పాను. అది ఒక వటవృక్షం లాగు కనిపించింది. ఆ నల్లగౌనులతో తిరిగేవారు, ఆ వట వృక్షాన్ని పట్టుకొని వేళ్ళాడే గబ్బిలాయిల్లాగు కనిపించారు. మరుక్షణం అదొక ప్రత్యేక ప్రపంచంలాగూ, ఆ నల్లగౌన్లతో తిరిగే అడ్వొకేట్లు మేఘాల్లాగూ కనిపించారు. దేశానికి ఉపయోగపడే యువకులను ఎంతమందిని తన పొట్టలో పెట్టుకుంటూ వుందీ యంత్రం!

"ఛీ" అనుకున్నాను.

ఇంతలో ప్రాణేశ్వరి జ్ఞాపకం వచ్చింది.

నాన్నగారు జ్ఞాపకం వచ్చారు.

స్నేహితులు జ్ఞాపకం వచ్చారు.

ఒకడుగు ముందుకు వేశాను.

"జాగ్రత్త" అన్నాడు నాలోనివాడు.

"బాబూ" అన్నది బాలింతరాలు.

"క్యార్" మన్నది కసిగందు.

ఆ ధ్వని చురకత్తికంటే పదునుగా నా హృదయంలోకి దిగింది. నా కళ్ళల్లో నీరు తిరిగింది. నన్నుచూచి ఆ బాలింతరాలు, "బాబూ!బాబూ" అంటూ తనుకూడా కంట తడిపెట్టుకుంది.

అకస్మాత్తుగా జేబులోఉన్న వెయ్యిరూపాయలు నా కళ్ళముందు తాండవించినై. వాటి బరువుతో, ఆశతో మొయ్యలేని బరువును నెత్తిన పెట్టుకున్న కూలిదానిలాగు కుంగిపోయాను. ధైర్యంగా, ఒణుకుతున్న చేతిని జేబులోకి పోనిచ్చాను.

"పిల్లలో" అన్నది హృదయేశ్వరి.

"నా జన్మ వృథా" అన్నారు నాన్నగారు.

"ఎప్పుడు? ఎప్పుడు" అన్నారు స్నేహితులు.

నా చెయ్యి జేబులోకి పోలేదు. అలాగే వేలాడబడి పోయింది.

"జాగ్రత్త" అన్నాడు నాలోనివాడు.

"బాబూ బాబూ" అన్నది బాలింతరాలు.

"క్యార్" మన్నది కసికందు.

నాకు ప్రపంచమంతా శూన్యంగా కనిపించింది. ఒక అడుగు ముందుకు వేశాను. నాలోనివాడు గిజగిజా తన్నుకున్నాడు. నేను ఒక వూపుతో హైకోర్టులోకి తనువుని జేరవేశాను.

"ట్" అని అరిచాడు నాలోనివాడు. నాలో యేదో పగిలి ముక్కలు ముక్కలయింది. నాలోనివాడు మరణించాడా?

)o....o(